మౌలిక వసతుల కల్పనకు వినతి

జోనల్ కమిషనర్‌ను కలిసిన గచ్చిబౌలి కార్పొరేటర్



జోనల్ కమిషనర్ స్నేహకు వినతిపత్రాన్ని ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌ను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కోరారు. సోమవారం గచ్చిబౌలిలోని శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్, కేశవనగర్, రాయదుర్గం, నల్లగండ్ల, హుడాకాలనీలో సీసీరోడ్ల సమస్య, పెండింగ్ పనులు, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. డివిజన్‌లో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో సమావేశం

శేరిలింగంపల్లి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో కార్పొరేటర్ సమావేశమయ్యారు. గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. డివిజన్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని వెంటనే పూర్తయ్యేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మన్నె రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



డీఎన్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన

పటాన్‌చెరు: ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం పెరగాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి గ్లాండ్ ఫార్మ పరిశ్రమ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్ చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని డిఎన్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో.. గ్రాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో రెండు కోట్ల రూపాయల అంచనాతో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.పటాన్‌చెరులో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థను ఏర్పాటు చేసి ఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దామని తెలిపారు. తల్లిదండ్రులు నాణ్యమైన విద్య కోసం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ , జెడ్పీటీసీ సుప్రజ ,వైస్ ఎంపీపీ స్వప్న ,మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కుమార్ గౌడ్, గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సిఎస్ఆర్ హెడ్ రఘు రామన్, ఎంఈఓ పీపీ రాథోడ్, ముత్తంగి గ్రామ కార్యదర్శి దయానంద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నాలాల రిటైనింగ్‌వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలి



నాలాను పరిశీలిస్తున్న బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్, మూసాపేట డివిజన్ పరిధిలోని రామారావునగర్, కబీర్‌నగర్, పాండురంగనగర్, స్నేహపురి కాలనీల్లో పలు నాలాలను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో నాలా పరీవాహక ప్రాంతాలను, ఇక్కడ జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో నాలా పక్కన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ జరుగుతున్న నాలా పూడికతీత పనులను రిటైనింగ్ వాల్ నిర్మాణానికి వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. రిటైనింగ్ వాల్‌తో పాటు పైన స్లాబ్ వేసి పూర్తిగా మూసి వేయాలని సూచించారు. లేదంటే వర్షాకాలంలో దోమలతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఎ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, సయ్యద్‌బాబు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తత అవసరం

శంషాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ముద్దం మల్లారెడ్డి



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ ముద్దం మల్లారెడ్డి

శంషాబాద్: నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దం మల్లారెడ్డి సూచించారు. సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు...రైతులు ఇప్పటికే పొలాల్లో దుక్కిదున్ని సిద్ధం చేసుకోవడంతో పాటు, విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా ఉండడం శుభసూచకమన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు పంటల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అన్నదాతల అవసరాలకు అనుగుణంగా రుణాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కర్ణం జ్ఞానేశ్వర్ యాదవ్, పాలకవర్గం సభ్యులు రంగారెడ్డి కరుణాకర్‌రెడ్డి, మైలారం సులోచన, గుర్రంపల్లి శ్రీనివాస్, అరుంధతి, సత్తయ్య, కొత్త పోచయ్య, సంఘం సీఈఓ అర్జున్, సిబ్బంది మోహన్, ఫిలోమెన్‌రాజు, రాంరెడ్డి, సదాశివరెడ్డి, వెంకటేశ్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప నగేష్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్ప నగేష్ కోరారు. సోమవారం పట్టణంలోని వార్డు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు కాలనీలలో పనులకు నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులు మొదలుపెట్టలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులను ప్రారంభించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకి ఇబ్బంది లేకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. పలు కాలనీలలో డ్రైనేజ్ సమస్య పెరుగుతుందని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. అదేవిధంగా పలుచోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదని మరమ్మతులు చేపట్టాలని కోరారు. వర్షాలు పడినప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

లేక్ ఫ్రంట్...ప్లే గేమ్స్

- లేజర్ వాటర్ ఫౌంటేన్ మ్యూజిక్ షో
- చిన్నారులకు ప్రత్యేక వసతులు

దుర్గం చెరువు పార్కులో చెస్ ఆడుకునేందుకు ప్రత్యేక హౌస్





దుర్గం చెరువు లేక్ ఫ్రంట్‌లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన చెస్ బోర్డు, ప్రత్యేక హౌస్

మాదాపూర్: దుర్గం చెరువు లేక్ ఫ్రంట్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే చిన్నారులకు పార్కులో ఆడుకునేందుకు అనేక వసతులను కల్పించారు నిర్వాహకులు. లేజర్ వాటర్ ఫౌంటేన్ మ్యూజిక్ షోను చూడడానికి ఆకర్షణీయమైన కుర్చీలను ఏర్పాటు చేశారు. రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9గంటల వాటర్ ఫౌంటేన్ మ్యూజిక్ షో ఉంటుంది. ఆరు దేశభక్తి పాటలకు 7 రంగులతో అనుగుణంగా మ్యూజిక్ వాటర్ ఫౌంటేన్ షోను నిర్వహిస్తారు.

- చిన్నారులకు శారీరక దారుఢ్యంతో పాటు మేధాశక్తి పెంపొందేలా ప్రత్యేక ఆట వస్తువులను ఏర్పాటు చేశారు.
- ప్రత్యేకంగా గ్రానైట్‌తో తయారు చేసిన చెస్ బోర్డు ఇతర ఆట వస్తువులను ఏర్పాటు చేశారు.
- ఏ పనిచేస్తే ఎంత ఆరోగ్యం, ఏ వ్యాయామం, ఎంత సమయం చేయాలి అనేది పట్టికల ద్వారా తెలుపుతున్నారు.
- చిన్నారుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పక్షుల విగ్రహాలను అక్కడక్కడ ఏర్పాటు చేశారు.
- దుర్గం చెరువు లేక్‌ఫ్రంట్ వాకింగ్, వ్యాయామం చేయడానికి సమయం ఉదయం 5గంటల నుంచి 9 గంటల వరకు ఉంటుంది.
- సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సందర్శకులకు పార్కు అందుబాటులో ఉంటుంది.
- పార్కులో ధూమపానం, మద్యపానం చేయకూడదు. చెత్తవేయరాదు, పెంపుడు జంతువులను తీసుకురావడానికి అనుమతి లేదు. పూలు కోయరాదు, ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదు. అనుమతి లేకుండా ఫొటోలు, వీడియో షూట్స్ తీయరాదనే నిబంధనల పట్టికను ఏర్పాటు చేశారు.

- ఒకసారి ప్రవేశం రూ.10
- చిన్నారులకు (5 సంవత్సరాల లోపల) రూ.5
- నెలసరి వాకింగ్ చేసేందుకు పాస్ రూ.200.
- సంవత్సరానికి వాకింగ్ చేసేందుకు పాస్ రూ. 2000.
- సీనియర్ సిటిజన్స్‌కి సంవత్సరానికి పాస్ రూ. 800.
- స్టిల్ కెమెరా (ఫొటోషూట్‌కోసం) రూ. 250.(రోజుకి)
- వీడియో కెమెరా షూటింగ్ రూ. 5000 (రోజుకి)
- ఫిల్మ్ షూటింగ్ చేయడానికి రూ.2500.







సందర్శకులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కుర్చీలు

ఎన్నికల హామీలను అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న ఎంసీపీఐ నాయకులు

శేరిలింగంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) గ్రేటర్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.500కే గ్యాస్ సబ్సిడీ నేరుగా ఇవ్వడం లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పుష్ప, మురళి, దశరథ్ నాయక్, ఆకుల రమేష్, నాగభూషణం, శివాని, సుల్తానా బేగం, రజియా బేగం, లలిత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జాగ్రత్తలు తప్పనిసరి

కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డా.రాజు

గచ్చిబౌలి: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ జి రాజు సూచించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై ముద్రించిన అవగాహన కరపత్రాన్ని కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుందని బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, దోమలు వృద్ధి చెందేందుకు అనువైన కాలమన్నారు. ముందు జాగ్రత్తలు విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సదానంద్ యాదవ్, వాణి సాంబశివరావు, ధర్మసాగర్, బాలన్న, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డా. రాజు తదితరులు

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు సన్మానం



దార్ల వెంకటేశ్వరరావును సన్మానించిన విద్యార్థి సంఘం నాయకులు

రాయదుర్గం: హెచ్‌సీయూ తెలుగు విభాగం మాజీ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఆలోచనలు విద్యార్థుల భవిష్యత్తుకు బాటని బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అంజి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన బీఎస్ఎఫ్ అధ్యక్షులు అంజి ఎర్రోళ్ల మాట్లాడుతూ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు సేవలు విద్యార్థుల మేలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొనే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు దివాకర్, త్రివేణి, నాయకులు విమల, ప్రసన్న, పావని, మల్లేష్, అనిల్, అతుల్, అజయ్, సందీప్, నవీన్, పవన్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



విద్యార్థులకు కళ్లద్దాలను అందజేసిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని బాల వికాస పాఠశాలలో చదువుతున్న చెవిటి, మూగ విద్యార్థులకు సహస్త్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేసిన కంటి అద్దాలను విద్యార్థులకు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. చెవిటి, మూగ విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారని , సంస్థకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సహస్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కృష్ణకిషోర్, మాదాపూర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు ప్రసాద్, జిల్లా గణేష్, ఆంజనేయులు, బాబుమోహన్, మల్లేష్, శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ‘నృత్యంగన’



మాదాపూర్: శిల్పారామం ఎథ్నిక్ హాల్‌లో సోమవారం కూచిపూడి నృత్యాలయం నృత్యంగన మొదటి వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ అవార్డుగ్రహీత, కూచిపూడి నాట్య గురువులు పద్మజారెడ్డి గడ్డం, భారతీయ జనతాపార్టీ వైస్ ప్రెసిడెంట్ ఆల్క మనోజ్‌లు హాజరయ్యారు. నృత్యంగన నాట్యాలయ గురువు అనుహ్యానాయుడు మల్లెపూడి ఆధ్వర్యంలో ఇచ్చిన ప్రదర్శనలో మూషిక వాహన, గణనాయక, బ్రహ్మమురారి, స్వాగతం కృష్ణ, తిరుతిరు జవరాల, ఒకపరి ఒకపరి, ప్రణవలాయ, దుర్గస్తుతి, అంశాలను ప్రదర్శించారు.

గృహిణి అదృశ్యం



నజ్మా

మియాపూర్ : భర్తతో గొడవపడి ఇంటినుండి బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యమైంది. మియాపూర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మక్తమహబూబ్‌పేట్‌లోని సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌లో మహమ్మద్ అన్వర్, నజ్మా(32) కలిసి ఉంటున్నారు. ఈ నెల 8వ తేదీ భార్య, భర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. అదే రోజు 8 గంటల ప్రాంతంలో నజ్మా ఇంటి నుండి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో ఆమె భర్త మహమ్మద్ అన్వర్ చుట్టు ప్రక్కల స్నేహితులు, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చందానగర్ పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్లు

ఎస్‌హెచ్‌ఓ డి.పాలవెల్లి :	9491039172
ఎస్ఐ నాగేశ్వర్‌రావు :	9010851257
ఎస్ఐ శ్రీధర్ :	8712663181
ఎస్ఐ సరిత రెడ్డి :	7993183570
ఎస్ఐ రఘు :	8712663184
ఎస్ఐ రమేష్ :	9866859530
ఎస్ఐ కిష్టయ్య :	8712663275
ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పీఎస్ నంబర్లు :	
ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ :	8712658749
ఎస్ఐ మోహన్ :	9550280288
జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ -21 అధికారుల వివరాలు	
ఉపకమిషనర్ వంశీకృష్ణ :	9491396877
ఏఎంసీ సురేష్ :	9989930462
సూపరింటెండెంట్, ఏఎంసీ విజయ్ :	9676684555
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ :	9701414306
టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్ :	9121240325
ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కార్తీక్ :	9640030445

ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం



హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లోని శ్రీ సాయి గణేష్ దేవాలయ పునః నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సోమవారం లక్ష రూపాయలు విరాళంను దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, భార్గవ్‌గౌడ్, రాంచందర్ మూర్తి, ఏడుకొండలు, హరి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 60, పచ్చిమిర్చి 80, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 60, కీర 40, బీర 80, వంకాయ 40, గోకర 60, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 120, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీ ఫ్లవర్ (1) 50, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 270.

కలుషిత నీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



తులసినగర్‌లో పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: కలుషిత నీటి సరఫరాను అరికట్టండని ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి వాటర్‌వర్క్స్ అధికారులు స్పందించారు. సోమవారం తులసినగర్‌లో వాటర్ లీకేజ్ అవుతున్న పైపులైన్‌ను పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ తులసినగర్‌లో కలుషిత జలాలు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని, వాటర్ వర్క్స్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల డయేరియా ప్రబలుతుందని తులసినగర్ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. పైప్‌లైన్ మరమ్మతుల చేయడంతో నీటి సమస్య పరిష్కారమవడంపై సాక్షికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో నలుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

‘హయత్’లో ఓరియంటల్ గ్రిల్ ప్రారంభం

రాయదుర్గం: పాకశాస్త్రంలో కొత్త శకానికి నాంది పలుకుతూ నానక్‌రాంగూడ (గచ్చిబౌలి)లోని హయత్ హోటల్‌లో కొత్తగా ఓరియంటల్ గ్రిల్‌ను సోమవారం ప్రారంభించారు. దీన్ని తెప్పన్యాకీ రెస్టారెంట్‌గా పిలుస్తారు. దీంట్లో థాయ్, ఇండోనేషియా, వియత్నామ్, జపనీస్, ఈస్టర్న్ వంటకాలను నగరవాసుల కళ్ల ముందే తయారు చేసి అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు హయత్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ సోమనాథ్ దే వివరించారు. ఆహార ప్రియులు కొత్త రుచులను ఆస్వాదించాలని కోరారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్.. రిమాండ్

మియాపూర్ : నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా అటువైపు వచ్చిన ఓ కారును ఆపి తనిఖీలు చేశారు. అందులో రామచంద్రాపురం బీరంగూడకు చెందిన మల్లెల రాజుకుమార్(24), మియాపూర్ గోకుల్ ప్లాట్‌కు చెందిన ఎస్.కార్తీక్ రెడ్డి(23), లింగంపల్లి తారానగర్‌కు చెందిన ముత్యం మణిదీప్(27)లను గుర్తించారు. కారును తనిఖీ చేయగా కారులో ఎండిఎంఎ 2.05 గ్రాములు, 20 గ్రాముల ఎండుగంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరు గోవా నుండి గంజాయిని తీసుకువచ్చి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి ఎండిఎంఎ, గంజాయి వారు ప్రయాణిస్తున్న కారును స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మరో ఘటనలో..

మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ సమీపంలో మియాపూర్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు అటువైపు వచ్చిన మియాపూర్ ఆల్విన్ కాలనీకి చెందిన పి. జగదీశ్వర్‌రెడ్డి(23)ను అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద తనిఖీ చేయగా 125 గ్రాముల ఎండు గంజాయిని గుర్తించారు. కొంతకాలంగా జగదీశ్వర్‌రెడ్డి సంతోష్‌రెడ్డి అనే వ్యక్తినుండి ఎండు గంజాయిని తీసుకువచ్చి స్థానిక ప్రాంతాల్లో విక్రయాలు చేస్తుండేవాడని పోలీసులు తెలిపారు. అతని వద్ద నుండి 125 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.